
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 8 । మే । 2025



సోమశిలలో 50.673 టీఎంసీలు
సోమశిల జలాశయంలో బుధవారానికి 50.673 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 1200, ఉత్తర, దక్షిణ కాలువలకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,00,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,098
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,371
నవర (8 గ్రాములు)	రూ.74,968

గరిష్టం/కనిష్టం
38.4 /28.1

వాతావరణం
జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 50 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా రాజేశ్వరి



నెల్లూరు (అర్బన్): నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్ జి.రాజేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె రాజమహేంద్రవరంలోని మెడికల్ కళాశాలలో బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై నెల్లూరు ప్రిన్సిపల్‌గా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆమెను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందు, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, పెద్దాస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కళారాణితోపాటు పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు బొకేలు అందజేసి అభినందించారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా

నెల్లూరు (టౌన్): జిల్లాలోని సెకండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల సీనియార్టీ తుది జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 9వ తేదీ లోపు తగిన ధ్రువపత్రాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఎర్రచందనం దుంగల పట్టివేత



ఆత్మకూరు: ఆత్మకూరు అటవీ శాఖ రేంజ్ పరిధిలోని సోమశిల ఉత్తరకాలువ సమీపంలో గుడిగుంట బీట్ వద్ద బుధవారం 11 ఎర్రచందనం దుంగలు అటవీ శాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వీటి బరువు సుమారు 300 కేజీలు ఉంటుందని తెలిపారు. ఉదయం 9.30 గంటల సమయంలో స్వాధీనం చేసుకున్న సిబ్బంది ఆటోలో వేసుకుని ఆత్మకూరుకు 11.30 గంటల సమయంలో చేరారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. కొందరు ఆ దుంగలను ఫొటోలు తీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అయితే సంబంధిత అధికారులు చెప్పకపోవడంతో జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్‌కే మహబూబ్‌బాషాను సంప్రదించగా తనకు సమాచారం తెలియలేదని చెప్పడం గమనార్హం.

వ్యాయామ విద్యకు మంగళం



కేజీ నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థులకు వ్యాయమ విద్య కీలకం. అటువంటి విద్యను కూటమి ప్రభుత్వం సమూలంగా దూరం చేసే కుట్ర చేస్తోంది. క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఒక పక్క ప్రభుత్వం మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద పోస్టులను నిర్దేశించింది. ప్రత్యేకంగా క్రీడల్లో ప్రతిభ, సీనియారిటీ ద్వారా ఆ కోటాలో ఉద్యోగాలు కల్పించనుంది. ఈ పోస్టుల భర్తీ కేవలం 6 నుంచి 10వ తరగతి పాఠశాలల వరకే పరిమితం. ఇంటర్మీడియట్ కళాశాలకు మాత్రం పీడీ పోస్టులను భర్తీ చేయకపోగా ఉన్న పోస్టులను కూడా సబ్జెక్ట్ అధ్యాపకుడిగా కన్వర్షన్ చేస్తోంది.

- పీడీ రిటైర్ అయితే ఇక ఆ పోస్టు రద్దు
- పీడీలను సబ్జెక్ట్ అధ్యాపకుడిగా కన్వర్షన్
- నెల్లూరు, ప్రకాశం జిల్లాలో 56 కళాశాలలకు ముగ్గురు పీడీలే

ఇంటర్ కళాశాలలకు పీడీ పోస్టుల భర్తీ లేనట్లేనా



కందుకూరులోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

కందుకూరు రూరల్: ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఇకపై ఉండవు. ఇప్పటికే ఉన్న ఖాళీలను భర్తీ చేయకపోగా, కొత్తగా ఎంపికలు కూడా నిలిపివేసింది. పీడీ పోస్టులను సబ్జెక్ట్ అధ్యాపకుడిగా కన్వర్షన్ చేస్తూ తీసుకున్న నిర్ణయంతో ఇంటర్ విద్యార్థులు వ్యయామ విద్యకు దూరం కానున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నెల్లూరు జిల్లాలో 23 ఉండగా, ప్రకాశం జిల్లాలో 33 ఉన్నాయి. అయితే నెల్లూరు జిల్లాలో 23 కళాశాలలకు కేవలం 16 కళాశాలల్లో మాత్రమే పీడీ పోస్టులు ఉన్నాయి. వీటిల్లో కూడా 15 మంది ఉద్యోగ విమరణ పొందగా ఒక్క మనబోలు కళాశాలలో మాత్రమే పీడీ పని చేస్తున్నారు. ఆయన కూడా వచ్చే ఏడాది ఉద్యోగ విమరణ పొందుతాడు. ప్రకాశం జిల్లాలో 33 కళాశాలలకు 20 కళాశాలల్లో పీడీ పోస్టులు ఉండగా ఇప్పటికే 18 మంది ఉద్యోగ విమరణ పొందగా మద్దిపాడు, సింగరాయకొండ కళాశాలల్లో మాత్రమే పీడీలు ఉన్నారు. వీరు కూడా త్వరలో ఉద్యోగ విరమణ పొందనున్నారు.

పోస్టు కన్వర్షన్ ఇలా..

జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందితే ఆ కళాశాలలో ఇక పీడీ పోస్టుకు మంగళం పలకనున్నారు. ఆ పోస్టులను అదే కళాశాల లేదా, పక్క మండలాల్లోనే కళాశాలల్లో సబ్జెక్ట్ అధ్యాపకుడిగా కన్వర్షన్ చేసి పోస్టులను అక్కడ భర్తీ చేస్తున్నారు. కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న పీడీ గత నెలలో ఉద్యోగ విరమణ పొందాడు. ఆ పోస్టును తాళ్లూరులో ని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సబ్జెక్ట్ అధ్యాపకుడిగా కన్వర్ట్ చేశారు. దీంతో టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీ పోస్టుకు మంగళం పలికారు. విశాలమైన క్రీడా మైదానం ఉన్నప్పటికీ పీడీ పోస్టులను కన్వర్ట్ చేసి పోస్టులను తగ్గించుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే నెల్లూరు జిల్లాలో 15, ప్రకాశం జిల్లాలో 18 పీడీ పోస్టులు సబ్జెక్ట్ అధ్యాపకులుగా కన్వర్ట్ చేశారు. తిరిగి ఆయా కళాశాలలకు పీడీ పోస్టులు మంజూరు చేసే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతోంది. ఉన్న పోస్టుల ను పక్కదారి మళ్లించి జీతాల ఖర్చును తగ్గించుకునే పనిలో పడింది.దీంతో జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులు వ్యాయామ విద్యకు మంగళం పలకనున్నారు.

మధ్యలో ఇంటర్‌ల్లోనే..

ఉన్నత పాఠశాలల్లో పీఈటీ, పీడీ పోస్టులు ఉన్నాయి. పాఠశాల స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. తిరిగి డిగ్రీ కళాశాలల్లో కూడా పీడీ పోస్టులు ఉన్నాయి. కానీ మధ్యలో ఇంటర్ కళాశాలల్లో పీడీ పోస్టులు లేనందు వల్ల విద్యార్థులు క్రీడల్లో రాణించలేకపోతున్నారు. క్రీడా మైదానాలు ఉన్న జూనియర్ కళాశాలల్లోనే పీడీ పోస్టులు ఉండేవి. అవి కూడా ప్రస్తుతం లేకుండా చేస్తున్నారు. ఇంటర్ చదివే విద్యార్థులకు వ్యాయామ విద్య అందని ద్రాక్షాగా మారనుంది.

రాడార్ కేంద్రంలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్లో గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న సీఐ, పోలీసు బలగాలు

పొదలకూరు : మండలంలోని నెల్లూరు మార్గంలో నిర్మాణంలో ఉన్న రాడార్ కేంద్రంలో బుధవారం పోలీస్, రెవెన్యూ, ఫైర్, ఆరోగ్యశాఖల అధికారులు, సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. భారత్ సైనికులు ఆపరేషన్ సిందూర పేరుతో పాక్ ఉగ్రవాద సంస్థలపై దాడులు నిర్వహించిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించారు. ఈ నేపథ్యంలో పాక్ ప్రతీకార దాడులకు పాల్పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. తహసీల్దార్ బి.శివకృష్ణయ్య, సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి, ఫైర్ అధికారి విజయవర కుమార్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదానీ పోర్టులో
కృష్ణపట్నం అదానీ పోర్టులో బుధవారం పోలీస్, ఫైర్, రెవెన్యూ, ఆరోగ్య, పోర్టు సెక్యూరిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అలర్ట్ చేసేందుకు డ్రిల్ ఏర్పాటు చేశారు. పాక్ వైమానిక దాడులు నిర్వహిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజల అప్రమత్తతపై అవగాహన కల్పించారు.



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నీటిని పొదుపుగా వాడుకోండి

- ఖరీఫ్‌కు 3.60 లక్షల ఎకరాలకు సాగునీరు
- సోమశిల జలాశయం నుంచి రెండో పంటకు నీటిని విడుదల చేసిన మంత్రి
- రెండో పంటకు సోమశిల జలాల విడుదల



స్విచ్ఛాన్ చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఆనం

సోమశిల: సోమశిల జలాశయం నుంచి రెండో పంటకు విడుదల చేస్తున్న సాగునీటిని పొదుపుగా వాడుకునే మరింత అత్యధిక విస్తీర్ణంలో పంటలు పండించుకోవాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రైతులు, అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు, గంగమ్మ తల్లికి చీరసారే, జలహారతి సమర్పించి పెన్నాడెల్టాకు నీటిని విడుదల చేశారు. మంత్రి ఆనం మాట్లాడుతూ జిల్లాలో రెండో పంటకు సోమశిల జలాశయం కింద 3.60 లక్షల ఎకరాలకు 42 టీఎంసీలు, తెలుగు గంగ ప్రాజెక్టుల కింద ఉమ్మడి జిల్లాలోని 1.60 లక్షల ఎకరాలకు 16 టీఎంసీల నీటిని రైతుల అవసరాల మేరకు విడుదల చేస్తామని చెప్పారు. సోమశిలలో నిల్వ ఉన్న 52 టీఎంసీంల్లో తాగునీరు, ఇతర అవసరాలకు 12 టీఎంసీలను నిల్వ ఉంచి మిగిలిన 40 టీఎంసీలను రెండో పంటకు రైతాంగానికి అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. పెన్నా డెల్టా కింద 2 లక్షల ఎకరాలకు 22.219 టీఎంసీలు, కనుపూరు ప్రధాన కాలువ కింద 20 వేల ఎకరాలకు 2.223 టీఎంసీలు, నార్త్ ఫీడర్ చానల్ 35 వేల ఎకరాలకు 3.889 టీఎంసీలు మొత్తం 3.64 లక్షల ఎకరాలకు 40.442 టీఎంసీలు విడుదల చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవచౌదరి, రాజగోపాల్, ఎస్‌ఈలు వెంకటరమణారెడ్డి, రాధాకృష్ణ, ఆర్డీఓ పావని, ఈఈలు, జెఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ తీసుకో.. పసుపు కండువా కప్పుకో

- ఎన్నికల నాటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతల కొనుగోళ్లలో ప్రశాంతిరెడ్డి బిజీబిజీ
- తాజాగా విడవలూరు సీనియర్ నేతకు భారీ మొత్తం ప్యాకేజీ ఆఫర్
- ఆయనకు, భార్యకు రాష్ట్ర స్థాయిలో పదవులు కట్టబెట్టిన ప్రసన్న
- అధికారం, పదవులు అనుభవించి.. ఇప్పుడు వెన్నుపోటు



కోవూరు: కోవూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నేతల కొనుగోళ్ల ప్రక్రియ ఎన్నికల నాటి నుంచి ఇప్పటి వరకు అప్రతిహతంగా కొనసాగుతోంది. తాజాగా విడవలూరుకు చెందిన ఆ పార్టీ సీనియర్ నేత ఒకరికి భారీగా ప్యాకేజీ ఇచ్చి పసుపు కండువా కప్పేందుకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన కండువా కప్పుకునేందుకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న కాలంలో మాజీమంత్రి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విడవలూరుకు చెందిన ఓ సీనియర్ నేతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన్ను పార్టీలో జిల్లా స్థాయి పదవులతోపాటు ఆయన భార్యకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవిని కట్టబెట్టి ఆ కుటుంబానికి అగ్ర తాంబూలమిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు అనేక విధాలుగా లబ్ధిపొందిన సదరు సీనియర్ నేత ప్యాకేజీలకు అమ్ముడుపోయి పార్టీకి వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధపడటాన్ని స్థానిక నేతలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఇటువంటి స్వార్థపూరిత నేత అని తెలియక వారి వెంట నడిచామని పార్టీ కేడర్ విచారం వ్యక్తం చేస్తోంది. ఇటువంటి నేతలు పార్టీని వీడినా పార్టీకి ఎటువంటి ఢోకాలేదని, ప్రజలే పార్టీకి బలమన్నారు. లక్షలకు లక్షలు ప్యాకేజీలు ఇచ్చుకుని పచ్చకండువాలు కప్పుతుండడం వెనుక మరో ఏడాదిలో జరగబోయే స్థానిక సంస్థల్లో గెలుపు కోసమేనని ప్రచారం జరుగుతుంది. దాదాపు 11 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలు, నష్టాలు, ఎదుర్కొంటున్న కొత్త అనుభవాలతో ప్రజలు ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా కూటమిని కూకటి వేళ్లతో సహా పెకళించేందుకు పల్లెల్లో ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ అధికారం ఉంటే అక్కడికి వెళ్లి పబ్బం గడుపుకునే నేతలను పార్టీలో చేర్చుకున్నప్పటికీ రేపటి స్థానిక ఎన్నికల్లో ప్రజలు చూపించే ఓటు దెబ్బతో ఎమ్మెల్యేకు, టీడీపీకి త్వరలోనే జ్ఞానోదయం కలుగుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


అక్రమాలు, అపచారాలు

జిల్లాలోని పవిత్ర పినాకినీ తీరంలో బుచ్చిరెడ్డిపాళెం మండలంలో మల్లికార్జున సమేత జొన్నవాడ కామాక్షితాయి శక్తి పీఠానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడికి రాష్ట్రంలో ఇతర జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. నిత్యం భక్తులతో ఆలయం రద్దీగా ఉంటుంది. రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. అయితే నిర్వహణ అంతంత మాత్రంగా ఉంది. ప్రతి సేవకు దేవదాయశాఖ నిర్దేశించిన టికెట్ ధరలు చెల్లించినా.. అనధికారికంగా అదనపు వసూళ్లు చేస్తున్నారు. అక్రమాలు, అపచారాలతో ఆలయ ప్రతిష్టను దిగజార్చుతున్నారు.


- జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో రాబంధుల తిష్ట
- ప్రతీదానికో రేటు, అదనపు వసూళ్లు
- భక్తులను దోచుకుంటున్న సిబ్బంది
- కొత్తగా సేవా కమిటీ ఎందుకు?
- ఆలయ నిధులు మింగేందుకేనా!



జొన్నవాడ కామాక్షితాయి ఆలయం



తలనీలాలుకు ఆలయంలో రూ.40తో జారీ చేసిన టోకెన్



అదనంగా రూ.30 ఫోన్‌పే చేసిన భక్తుడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అత్యంత పవిత్రమైన జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో అపచారాలు జరుగుతున్నాయి. అవినీతి, అక్రమాలు పెచ్చు మీరుతున్నాయి. ఆలయానికి జిల్లాలో వందల ఎకరాలు భూములు, రూ.కోట్ల ఆస్తులు ఉన్నాయి. వేలం ద్వారా రాబడి అధికంగా వస్తోంది. అయినా భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. అదనపు వసూళ్లకు పాల్పడుతూ అమ్మవారి దర్శనానికి రావాలంటేనే భయపడేలా చేస్తున్నారు.

నిలువు దోపిడీ
ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులను అడుగడుగునా నిలువు దోపిడీ చేస్తున్నారు. దేవదాయశాఖ నిర్దేశించిన టికెట్ ధరలకు సేవలు పొందాలంటే కుదరదు. ఆలయంలో ప్రవేశించనప్పటి నుంచి ప్రతి సేవకో రేటు ఫిక్స్ చేశారు. ఆపై అనధికారికంగా అదనపు వసూళ్లు చేస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. చెప్పుల స్టాండ్ ఉచితంగా నిర్వహించాల్సి ఉన్నా సందర్భాన్ని బట్టి జతకు రూ.5, రూ.10 వసూలు చేస్తున్నారు. దీనికి సంబంధించి ఎలాంటి రసీదు ఇవ్వరు. తలనీలాలు సమర్పించేందుకు రూ.40 టికెట్ ధర చెల్లించాలి. అయితే సదరు తలనీలాలు తీసే వ్యక్తికి అదనంగా మరో రూ.30 లేదా అంతకంటే ఎక్కువ సమర్పించుకోవాల్సిందే. ఎందుకు చెల్లించాలని అడిగితే అసహ్యంగా దుర్భాషలాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఇటువంటి ఘటనే వెలుగుచూసింది కొందరు భక్తులు డబ్బులు లేవని చెప్పినా ఫోన్‌పే, గూగుల్‌పే చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. చేసేదేమీ లేక భక్తులు వారు అడిగినంత చెల్లిస్తున్నారు. ప్రత్యేక సందర్భాలు, పుట్టు వెంట్రుకలు, మొక్కులు అయితే సిబ్బంది పంట పండినట్లే వారు ఎంత డిమాండ్ చేస్తే అంత చెల్లించుకోవాల్సిందే. స్నానం చేయడానికి ఒక్కొక్కరికి రూ.10 చెల్లించాలి. గదుల్లో నీటి సౌకర్యం, డోర్లు మాత్రం సరిగా ఉండవు. ఒక గదిలో నీరు వస్తుంటే మరో గదిలో నీరు రాదు. పరిశుభ్రత దారుణంగా ఉంది. దీనికితోడు బిహార్‌కు చెందని ఓ వ్యక్తి అక్కడ భక్తుల నుంచి నగదు వసూలు చేస్తున్నాడు. అతనికి తెలుగురాదు. దీంతో భక్తులు అతనికి చెప్పేది అర్థంకాక అసహనం వ్యక్తం చేస్తున్నారు. శీఘ్రదర్శనం పేరిట రూ.50, ప్రత్యేక దర్శనం పేరిట రూ.25 వసూలు చేస్తున్నారు. ఇవికూడా భక్తులకు అదనపు భారంగా మారాయి. 80 గ్రాముల లడ్డూ రూ.15, 400 గ్రాముల లడ్డూ రూ.100కు విక్రయిస్తున్నారు. ఒక భక్తుడు అమ్మవారి దర్శనానికి వెళ్లి బయటకు రావాలంటే సుమారుగా రూ. 300 నుంచి రూ.400 ఖర్చు పెట్టాల్సిందే.

కొత్తగా సేవా కమిటీ ఏర్పాటు
దేవదాయశాఖ నిబంధనల మేరకు ఆ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలకు ధర్మకర్తల మండలి ఉంటుంది. జొన్నవాడ ఆలయంలో కూడా ధర్మకర్తల మండలి ఉంది. మావులూరు శ్రీనివాసులురెడ్డి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధర్మకర్తల మండలిని ఉద్దేశ పూర్వకంగానే నిర్వీర్యం చేశారు. ఈ నెల 17వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో సేవా కమిటీ పేరుతో 12 మంది సభ్యులను నియమించారు. ధర్మకర్తల మండలి ఉండగా కమిటీ ఎందుకు నియమించారో ఎవరికీ అంతుపట్టని. గతంలో ఇలాంటి సంప్రదాయం ఎప్పుడూ లేదు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకే కమిటీని నియమించినట్లు తెలుస్తోంది. ధర్మకర్తల మండలి ఉండగా సేవా కమిటీ పేరుతో టీడీపీకి చెందిన వ్యక్తులను కమిటీలో నియమించడం నిధులు మింగేందుకేనని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ
ఆలయంలో ఏం జరుగుతుందో నిత్యం పర్యవేక్షించాల్సిన ఈఓ ఇవేవీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అదనపు వసూళ్లకు పాల్పడే సిబ్బందిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడంలో తీవ్రంగా విఫలమయ్యారు. ఆలయానికి వచ్చే వీవీఐపీలు, వీఐపీల సేవలో నిమగ్నమై సామాన్యులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రుళ్లు నిద్ర చేసేందుకు వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలు, భద్రతా విషయాల గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. దీంతో కొందరు స్థానికంగా కొందరు ఆకతాయిలు మహిళా భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయ నిర్వహణ ఏ మాత్రం బాగలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనల మేరకే సేవాకమిటీ నియమించాం

దేవదాయశాఖ నిబంధనల మేరకు బ్రహ్మోత్సవాలకు సంబంధించి సేవా కమిటీ నియమించుకునే వెసులుబాటు ఉంది. అందులో భాగంగానే సేవాకమిటీని నియమించాం. బ్రహ్మోత్సవాలు పూర్తయిన తర్వాత కమిటీ దానికదే రద్దవుతుంది. – అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ఈఓ, జొన్నవాడ

ఇటీవల ఘటనలు

అత్యంత పవిత్రమైన క్షేత్రంలో నిద్ర చేసే భక్తులు తమ దుస్తులను ఉచికి ఏకంగా ఆలయ ఆవరణలోని క్యూలైన్లలో ఆరవేసిన ఘటన ఇటీవల వెలుగు చూసింది. కళ్ల ముందు ఇలాంటి అపచారాలు కనిపిస్తున్నా ఆలయ సిబ్బంది కానీ, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై భక్తులు మండిపడ్డారు. అదే రోజు దర్శనానికి వచ్చిన భక్తులపై మతిస్థిమితం లేని వ్యక్తి దాడికి ప్రయత్నించడంతో కలకలం రేగింది. ఆలయ పరిసరాల్లోనే మద్యపానంతోపాటు మాంసాహారం భుజించడం వంటివి కూడా జరుగుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆలయ ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డిని ప్రశ్నించగా తనకు తెలియదని, సిబ్బందిని అడిగి తెలుసుకుంటానని చెప్పడం చూస్తే.. ఈఓకు ఆలయంలో ఏం జరుగుతోందో కూడా తెలియడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.




క్యూలైన్లలో దుస్తులు ఆరవేసి ఉన్న దృశ్యం (ఫైల్)



నెల్లూరులో రియల్ అభివృద్ధి

నెల్లూరు(బారకాసు): రోడ్లు, విద్యుత్, రవాణా తదితర మౌలిక సదుపాయాలున్న ప్రాంతాలకే అభివృద్ధి విస్తరిస్తుంది. పరిశ్రమలు, నివాస, వాణిజ్య సముదాయాలతో కిక్కిరిసిపోతున్న నెల్లూరు అభివృద్ధి.. క్రమంగా చుట్టుపక్కల గ్రామాల మార్గంలో శరవేగంగా దూసుకెళ్తోంది. పుష్కలంగా భూముల లభ్యత, అందుబాటు ధర, మెరుగైన రవాణా, మౌలిక వసతులు ఉండటంతో నెల్లూరు రూరల్ పరిధిలో రియల్ మార్కెట్ అభివృద్ధి చెందే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ప్రశాంత వాతావరణానికి నెల్లూరు పెట్టింది పేరు. నగరానికి చుట్టుపక్కల ఉన్న కోవూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, జొన్నవాడ, వెంకటాచలం తదితర ప్రాంతాలు పాడిపంటలతో కళకళలాడుతాయి. నెల్లూరు తూర్పు ప్రాంతాలు కోనసీమను తలపిస్తాయి. అంతేకాకుండా సమీపంలో పెన్నా నది, బ్యారేజీ ఉండటంతో తాగునీటికి ఇబ్బంది లేదు. తీర ప్రాంతంలో కృష్ణపట్నం పోర్టు, ఏపీ జెన్‌కోతో పాటు పలు అయిల్, విద్యుత్ పరిశ్రమలు మెండుగా ఉన్నాయి. కృష్ణపట్నం పోర్టు నుంచి పది కిలోమీటర్ల సమీపంలో క్రిస్ సిటీని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులోనూ అనేక పరిశ్రమలు రానున్నాయి. గూడూరు - వరగలి క్రాస్‌రోడ్డు నుంచి ఏర్పాటైన సాగరమాల హైవే ద్వారా చెన్నై, తిరుపతికి రెండు గంటలు.. బెంగళూరుకు ఐదు గంటల్లో చేరుకునే అవకాశం ఉంది. ఇలా అన్ని విధాలా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రత్యక్షంగా వేలాది మంది, పరోక్షంగా లక్షలాది మంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఓబులాపురం నుంచి కృష్ణపట్నం రైల్వే లైన్ వెంకటాచలం సమీపంలోనే వెళ్తోంది. పలు విద్యాసంస్థలతో పాటు ఇంజినీరింగ్ కళాశాలలు నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ఉన్నాయి. దీంతో విద్య, ఉపాధి కోసం ఇతర ప్రాతాల నుంచి నెల్లూరుకు వలస వస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో నగర జనాభా పది లక్షలకు చేరింది. దీనిబట్టి చూస్తే నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో నివాసం ఉండేందుకు ప్రజలు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు.



విరివిగా వెంచర్లు

రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో రియల్టర్లు ప్రజలకు అనుకూలంగా అన్ని మౌలిక వసతులను కల్పిస్తూ వెంచర్లు వేస్తున్నారు. ఈ విషయంలో అనేక మంది రియల్టర్లు పోటీపడుతున్నారు. నగరంలో పార్కులు, మాళ్లు, వాణిజ్య సముదాయాలు, దేవాలయాలున్నాయి. జనసాంద్రత, రద్దీ ప్రాంతాల బదులు ప్రశాంతత కోసం నగరానికి కొంచెం దూర ప్రాంతాలను ఎంచుకుంటారు. ఇదే సమయంలో రవాణా సౌకర్యం పెరగడంతో పాటు ఆయా మార్గాల్లో రియల్ ఎస్టేట్ అవకాశాలు ఏర్పడ్డాయి. కార్పొరేషన్ పరిధిలోని జాతీయ రహదారి, పొదలకూరు రోడ్డులోని కొత్తూరు సమీపంలో కావేరినగర్ వెనుకవైపు నుడా అప్రూవల్‌తో కూడిన పలు వెంచర్లు ఉన్నాయి. ఆయా వెంచర్లలో అన్ని మౌలిక వసతులను కల్పిస్తూ అందరికీ అందుబాటు ధరల్లో ప్లాట్లను విక్రయిస్తున్నారు. సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే కోరికతో వీటిని ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. వీరికి ఇబ్బందుల్లేకుండా వారి కోరిక మేరకే తక్కువ ధరలకే ఆకర్షణీయమైన అధునాతన భవనాలను నిర్మించిస్తున్నారు.